క్లుప్తంగా

తేనేతుట్టె తొలగించారు..!



సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముఖద్వారం వద్ద ఉన్న పెద్ద తేనెతుట్టెను అధికారులు తొలగించారు. ఈ నెల 14న 'సాక్షి' పత్రికలో 'తేనేతుట్టె తొలగించాలి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం కూలీలతో తేనేతుట్టెను తొలగించి శుభ్రం చేయించారు. దీంతో కార్యాలయానికి వచ్చే సిబ్బంది, ప్రజలకు ప్రమాదం తప్పింది.

ఎంఈవో కార్యాలయం తరలింపు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హరిజనవాడ, బైపాస్ రోడ్‌లో నిర్వహిస్తున్న ఎంఈవో కార్యాలయాన్ని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పాత జిల్లా విద్యాశాఖా కా ర్యాలయానికి తరలించారు. నస్పూర్, హాజీపూర్‌కు సంబంధించిన కార్యకలాపాలు ఆయా మండలాల భవనం (బిల్డింగ్) పూర్తయ్యేవరకు ఇక్కడి నుంచి కొనసాగనున్నాయి.

'బుగ్గ' ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న సర్పంచులు

బెల్లంపల్లిరూరల్: బీఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య రానున్న ఎన్నికల్లో గెలుపొందాలని బెల్లంపల్లి మండల సర్పంచ్‌లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సర్పంచ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అశోక్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి, సర్పంచ్‌లు రంజిత, స్వరూప, మాధవి, ప్రమీల, కృష్ణమూర్తి, సురేష్, మాజీ ఎంపీపీ సుభాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో నర్సింగ్ ఆఫీసర్ మృతి



సరిత సంపూర్ణ(ఫైల్)

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్సు)గా విధులు నిర్వర్తిస్తున్న సరిత సంపూర్ణ(42) గుండెపోటుతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఆమె మృతికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్ చంద్రరెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ మేరీ సుకన్య, ఏడీ ఎండీ ఇస్మాయిల్, ఆసుపత్రి సిబ్బంది సంతాపం తెలిపారు.

చెన్నూర్ ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని వినతి

మంచిర్యాలక్రైం: వైఎస్సార్‌టీపీ నుంచి చెన్నూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని కోరుతూ వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్టా రామిరెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జి బెజ్జంకి అనిల్‌కుమార్ సోమవారం అప్లికేషన్ ఫాంను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు నీలం రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు గడిపెల్లి కవిత, జిల్లా అధ్యక్షుడు కాశీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సమావేశం

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధిహామీ అభివృద్ధి పనులపై సోమవారం సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన పబ్లిక్ షేరింగ్ కార్యక్రమం తూ.తూ మంత్రంగా నిర్వహించారు. 2020–21 నుంచి 2022–23 వరకు జరిగిన ఉపాధి పనుల అవకతవకలను వివరించారు. మొత్తం రూ.3 కోట్ల 80లక్షల విలువైన పనులపై పబ్లిక్ షేరింగ్‌లో చదివి వినిపించారు. మస్టర్ల కొట్టివేతలు, సంతకాలు లేకుండానే కూలీల వేతనాలు డ్రా చేయడంలాంటివి తనిఖీలో బహిర్గతమయ్యాయి. హరితహారంలో నాటిన మొక్కలు చనిపోవడం, నేమ్ బోర్డులు, రికార్డుల్లో వచ్చిన తేడాలపై పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలకు జరిమానా విధించారు. ఎవరెవరికి ఎంత జరిమానా విధించారో అధికారులు వివరాలు బహిర్గతం చేయలేదు. అక్రమాలు జరిగినా అధికారులు, తనిఖీ బృందాలు కుమ్మక్కై అసలు విషయాలను బహిర్గతం చేయలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ దత్తరావు, జిల్లా అంబుడ్స్‌మెన్ శివరాం, ఎంపీడీఓ లక్ష్మయ్య, క్లస్టర్ ఏపీడీ శంకరమ్మ, అదనపు విజిలెన్స్ అధికారి కిరణ్, ఏపీఓ సత్యప్రసాద్, ఈసీ మధుకర్ పాల్గొన్నారు.



రాష్ట్ర ఎన్నికల అధికారికి వినతిపత్రం ఇస్తూ..



శ్రీరాంపూర్: సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



కాసిపేట గని మేనేజర్‌కు ఏఐటీయూసీ వినతి

సింగరేణి కార్మికుల ఆందోళన

- లాభాల వాటా నిలిపివేతపై గరంగరం
- టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసనలు



ఆర్కే 6 గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్/బెల్లంపల్లి/రామకృష్ణాపూర్/కాసిపేట: ఎన్నికల కోడ్‌తో సింగరేణి కార్మికులకు ఈ నెల 16న చెల్లించే లాభాల వాటా చెల్లించకుండా నిలిపివేశారని దీనికి ఎన్నికల కోడ్‌కు ఏ మాత్రం వర్తింప జేయకూడదని సింగరేణి కార్మిక వర్గం డిమాండ్ చేస్తోంది. లాభాల్లో వాటాను ఈ నెల 4వ తేదీన ప్రకటించగా, అసెంబ్లీ ఎన్నికల కోడ్ 9వ తేదీన అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. కాలయాపన లేకుండా డబ్బులు కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని కోరుతున్నారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా సోమవారం ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. లాభాల వాటా చెల్లించేలా సింగరేణికి ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. శ్రీరాంపూర్‌లో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఎస్కే బాజీసైదాలు మాట్లాడుతూ.. యాజమాన్యం తక్షణమే డబ్బుల చెల్లింపులపై నిర్ణయం తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గనులపై యూనియన్ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీలు మోత్కూర్ కొమురయ్య, కిషన్‌రావు, ఫిట్ సెక్రెటరీ ఆకుల లక్ష్మణ్, సంఘం సదానందం, దాడి రాజయ్య, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. సీఐటీయూ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు పాల్గొన్నారు. మందమర్రిలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వర్క్‌షాపు డీవైజీఎం నాగరాజ్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు రాజశేఖర్, రవీందర్, కొండల్‌రావు తదితరులు ఉన్నారు. బెల్లంపల్లిలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్)ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.అనంతరం గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ గని ఫిట్ సెక్రెటరి దాసరి శ్రీనివాస్, ఏరియా నాయకులు వెంకటరమణ, రాజనాలరమేష్, మైన్స్‌కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సింగరేణి ఆసుపత్రి ఎదుట, మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై ధర్నా నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, ఏఐటీయూసీ గని ఫిట్ సెక్రెటరీ తిరుపతి గౌడ్, నాయకులు పాల్గొన్నారు. రామకృష్ణాపూర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్కే ఓసీ, సీహెచ్‌పీలలో ఆందోళన చేపట్టారు. అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. యూనియన్ బ్రాంచి కార్యదర్శి అంజనేయులు, హరిరామకృష్ణ, సీతారామారావు, సిరాజుద్దీన్, శ్రీధర్‌రావు పాల్గొన్నారు. కాసిపేట 2గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి ఏజెంట్ రాందాస్, మేనేజర్ లక్ష్మినారాయణలకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి సారంగపాణి, నాయకులు పాల్గొన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి గని మేనేజర్ అల్లావుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ అలీ, గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మినారాయణ, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి రాజేందర్, క్లరికల్ స్టాఫ్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్‌లో...



బెల్లంపల్లి: గని మేనేజర్‌కు టీబీజీకేఎస్ వినతి



మందమర్రిరూరల్: మాట్లాడుతున్న సంపత్

పాత బెల్లంపల్లిలో కేంద్ర అధికారుల పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని పాత బెల్లంపల్లి గ్రామంలో కేంద్ర అధికారుల బృందం పర్యటించింది. సోమవారం కేంద్ర సెక్రెటేరియట్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ సెక్షన్ అధికారులుగా(ఏఎస్‌వో) ప్రొబేషనరీ విధులు నిర్వర్తిస్తున్న పలువురు అధికారులు డాక్టర్ ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గ్రామంలో మూడు రోజుల పాటు పర్యటించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సామాజిక ఆర్థిక, రాజకీయ స్థితిగతులను తెలుసుకోవడం, బీపీఎల్ కుటుంబాలు, కనీస నివాస భూమిలేని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక ఆర్థిక, రాజకీయ కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యంతో పాటు సంక్షేమ పథకాల ప్రభావం గ్రామాల్లో ఎలా పని చేస్తోంది అనే అంశాలపై అధ్యాయనం చేయనున్నట్లు సూచించారు. దీంతో పాటు ఇతర అంశాలపై స్థానిక అధికారులతో సమీక్షించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌వో బృందం సభ్యులు రిషప్ దేవ్‌కుమార్ ప్రసాద్, వెంకటేష్ బాబు, హర్మీత్ కుమార్, సన్నీ కుమార్, హన్సరాజ్ జాఖర్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం శ్యామల, కార్యదర్శి శ్రీధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12–డి ఫారం అందజేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం 80సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు వేసే అవకాశం కల్పించిందని తహసీల్దార్ సతీశ్‌కుమార్ అన్నారు. హాజీపూర్ మండలం రాపల్లిలో సోమవారం 80ఏళ్లు దాటిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసేందుకు అవసరమైన 12–డి ఫారంలను అందజేశారు.



కేటీఆర్ ఆధ్వర్యంలో చేరిక



రాజేశ్వర్‌కు కండువా కప్పుతున్న కేటీఆర్

జన్నారం: టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి రాజేశ్వర్ సోమవారం టీడీపీకి రాజీనామా చేసి, హైదరాబాద్ ప్రగతిభవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన అతడికి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకోసం తనవంతు కృషిచేస్తానని రాజేశ్వర్ తెలిపారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఇంటర్మీడియట్ అధికారిని శైలజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బాగా చదవాలని సూచించారు. సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలన్నారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విజిత్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

సుమన్‌కు మహిళల మద్దతు



సరోత్తంరెడ్డిని సన్మానిస్తున్న మహిళలు

భీమారం: చెన్నూరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాల్క సుమన్‌కు సోమవారం మండలంలోని వివిధ గ్రామాల మహిళలు మద్దతు తెలిపారు. మండల కేంద్రంలో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు చెరుకు సరోత్తంరెడ్డిని కలిసి ప్రచారం కూడా చేస్తామని ప్రకటించారు. శాలువాతో సరోత్తంరెడ్డిని సన్మానించారు. బాల్కసుమన్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు మహిళలు ముందుకురావడం సంతోషంగా ఉందని సరోత్తంరెడ్డి పేర్కొన్నారు.

'ఎమ్మెల్యే టిక్కెట్ కాంగ్రెస్‌కే కేటాయించాలి'

కోటపల్లి: చెన్నూర్ అసెంబ్లీ టికెట్ పొత్తులో సీపీఐ కాకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికే కేటాయించాలని మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి డిమాండ్ చేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లయ్య, మాజీ ఎంపీటీసీ బాపు, ఆరె బాపు, నాయకులు శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, భాస్కర్, వెంకటి, మధునయ్య, పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ వారికే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే ఆశావహులు సొత్కు సుదర్శన్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద సోమవారం పార్టీ కార్యకర్తలతో కలిసి ఆందోళన చేపట్టారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

జ్వరంతో మహిళ మృతి

లక్సెట్టిపేట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయినగర్‌కు చెందిన మల్లక్క(52) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. కొద్ది రోజుల నుంచి జ్వరం రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. జ్వరం తగ్గకపోవడంతో కరీంనగర్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లికి చెందిన తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. మండలంలోని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దాత శ్రీనివాస్ సహకారంతో పౌష్టికాహారాన్ని గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అనీష్, తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రత్నం రాజం, వెంకటరాజం, శంకర్ గౌడ్, హెచ్ఈవో సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి, నెన్నెల గ్రామాల రైతుల వరి పంట పొలాలను వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అగ్గి తెగులు, సుడి దోమ, ఆకుమాడు తెగులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించా రు. నత్రజని వినియోగం తగ్గించాలని సూచించారు.

ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరుమందమర్రికి చెందిన రాజ్యలక్ష్మి–చంద్రశేఖర్ కుమారుడు ఆరోగ్య పరిస్థితి బాగాలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న మేముసైతం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సేకరించిన రూ.20వేలు సోమవారం బాధితులకు అందించారు.

మానవతా విలువల శిక్షణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న జీఎం మనోహర్

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రశాంతి మందిరంలో భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక, మానవతా విలువల శిక్షణ శిబిరాన్ని సోమవారం మందమర్రి జీఎం మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా చక్కటి విలువలను అలవర్చుకోవాలన్నారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం నాగరాజు, ఏఎస్ఓ రవీందర్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రాల అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో సోమవారం 15మంది యువకులకు ఏరియా జీఎం మనోహర్ కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించి, గైర్హాజరు లేకుండా విధులు నిర్వర్తించి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, లక్ష్యానికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వో టు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు ఉన్నారు.

10మందికి జనరల్ మజ్దూర్‌లుగా పదోన్నతి

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై సోమవారం జనరల్ మజ్దూర్‌లుగా క్రమబద్ధీకరించబడిన 10మంది బదిలీ వర్కర్లకు గ్రూప్ ఏజెంట్ రాందాస్ చేతుల మీదుగా ఆర్డర్ కాపీలు అందజేశారు. రెస్క్యూ టీం సభ్యులకు లైఫ్ సేవింగ్ ప్రశంసపత్రం, మెడల్స్ అందించారు. గైర్హాజరు లేకుండా ఉద్యోగులు విధులకు హాజరుకావాలని, రక్షణతో కూడిన ఉత్పాదకత వైపు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో గని మేనేజర్ లక్ష్మినారాయణ, రక్షణాధికారి సంతోష్‌రావు, ఇంజనీర్ రఘు, సంక్షేమాధికారి బార్గవ్, అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలతో ప్రజలకు మేలు

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



3వ వార్డులో కొక్కిరాల సురేఖ ప్రచారం

మంచిర్యాలటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలను తీసుకొచ్చిందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 3వ వార్డులో సోమవారం గడప గడపకూ వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలను ప్రజలకు వివరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, మంచిర్యాల అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఓటు వేయాలని కోరారు.

కొత్తపేటలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

జన్నారం: మండలంలోని కొత్తపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ఇటీవల విడుదల చేసిన ఆరుగ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆనంద్ రావు, ప్రశాంత్‌యాదవ్, అబ్దుల్ ముజ్జు, ఆకుల రాకేష్ గౌడ్, ఆత్రం బొజ్జు పటేల్, మారు పటేల్, లచ్చుపటేల్ పాల్గొన్నారు.

ఆర్కేపీ అదనపు ఎస్సైగా స్వరూప్‌రాజ్



సీఐకి మొక్క అందిస్తున్న స్వరూప్‌రాజ్

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌కు అదనపు ఎస్సై(ఎస్ఐ–2)గా ఎన్.స్వరూప్‌రాజ్‌ను నియమిస్తూ రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు స్వరూప్‌రాజ్ బాధ్యతలు స్వీకరించారు. దీనికి ముందు మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డిని స్వరూప్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని, ఎన్నికల దృష్ట్యా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సీఐ సూచించారు.

మందమర్రి అదనపు ఎస్సైగా హరిశేఖర్

మందమర్రిరూరల్: మందమర్రి అదనపు ఎస్సైగా హరిశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై హరిశేఖర్ సీఐ మహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా విధులు నిర్వర్తించాలని చూడాలని సూచించారు.

కొనసాగుతున్న జర్నలిస్టుల నిరసన



దండేపల్లి: రాస్తారోకో చేస్తున్న విలేకరులు



వడాలలో అంబేద్కర్ విగ్రహానికి వినతి

దండేపల్లి: ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ విలేకరులపై చేసిన వ్యాఖ్యలను దండేపల్లి ప్రెస్‌క్లబ్ ఖండించింది. నల్లబ్యాడ్జీలు ధరించి, స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రహదారిపై సోమవారం ప్రింట్, ఎలక్ట్రాన్ మీడియా రాస్తారోకో చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న విలేకరులపై వంకర వార్తలు రాసేటోళ్లను సక్కగజేయాలని మాట్లాడటం సరికాదన్నారు. సుమన్ జర్నలిస్టులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బండి రవిగౌడ్, కుమారస్వామి, సభ్యులు ఎడ్ల రాజన్న, వెంకటపతి, ప్రసాద్, సత్యం, శ్రీనివాస్, సత్తన్న, సుభాష్, ఎంపీటీసీ శ్రీనివాస్, కమలాకర్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భీమిని: జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని భీమిని ప్రెస్‌క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని వడాల గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. జర్నలిస్టులకు బీజేపీ మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాగం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రవీందర్‌రావు మద్దతు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



లక్సెట్టిపేట: స్థానిక సీఎస్ఐ పాఠశాలలో 2001–2002లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఒకే చోట కలిశారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఒకరికిఒకరు సంతోషాలను పంచుకున్నారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిఫాదర్ డేవిడ్ పాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు

కాసిపేట: మండలంలోని సోమగూడెం, కాసిపేట, దేవాపూర్, దుబ్బగూడెం గ్రామాల్లో సోమవారం రెండోరోజు దుర్గామాత బాలత్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.